

## లెక్కింపు కేంద్రాల పనులు పూర్తి చేయాలి : కలెక్టర్



ఏర్పాట్ల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఖమ్మం రూరల్, నవంబర్ 28: లెక్కింపు కేంద్రాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని పొన్నెకల్ పరిధిలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో లెక్కింపు కేంద్రాల ఏర్పాట్ల పనుల పురోగతిని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్‌రూంను పరిశీలించి ఈవీఎంల భద్రతకు ఏర్పాటు చేసిన ర్యాకులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల సంఖ్య మేరకు టేబుళ్లు ఉండాలని, హెల్ప్ డెస్కును ఏర్పాటు చేయాలని, పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. వాటర్ ప్రూఫ్ టెంట్లు వేయాలని, మొబైల్ టాయ్‌లెట్లు అందుబాటులో ఉంచాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టంను సైతం ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసుదన్ నాయక్, అదనపు డీసీపీ ప్రసాదరావు, పాలేరు రిటర్నింగ్ అధికారి ఎం రాజేశ్వరి, జిల్లా సంక్షేమ అధికారి సుమ, ఏడీ శ్రీనివాసులు, ఏసీపీలు బస్వారెడ్డి, ప్రసన్నకుమార్ ఉన్నారు.

## ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

మామిళ్లగూడెం, నవంబర్ 28: అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో భాగంగా సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు తుషార్ కాంత మహంతి, సతేంద్రసింగ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సూక్ష్మ పరిశీలకుల (మైక్రో అబ్జర్వర్) శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు పాల్గొని, విధుల పట్ల సూక్ష్మ పరిశీలకుల విధులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల ప్రక్రియలో కళ్లు, చెవుల వంటి వారని, ఎలాంటి అవాంతరాలకు చోటు లేకుండా ఎన్నికల విధులను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, పోలింగ్ ప్రక్రియను గమనిస్తూ, ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఉన్నా సంబంధిత రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సూక్ష్మ పరిశీలకులకు విధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకుడు కె.శ్రీరామ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు మదన్‌గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

## మద్యం అమ్మితే సమాచారం అందించండి

### జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేంద్రరెడ్డి

మామిళ్లగూడెం, నవంబర్ 28: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 30వ తేదీ ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో అన్ని రకాల మద్యం దుకాణాలు మూసివేయాలని జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేంద్రరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాలు, బార్లు, క్లబ్‌లు, కల్లు దుకాణాలను మూసి వేశామని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం అమ్మితే వెంటనే ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారి-8712658840, ఎక్సైజ్‌స్టేషన్ ఖమ్మం-1- 8712658841, ఎక్సైజ్ స్టేషన్ ఖమ్మం-2-8712658842, ఎక్సైజ్‌స్టేషన్ నేలకొండపల్లి-8712658843, ఎక్సైజ్‌స్టేషన్ వైరా-8712658844, ఎక్సైజ్‌స్టేషన్ మధిర-8712658845, ఎక్సైజ్ స్టేషన్ సత్తుపల్లి-8712658847, ఎక్సైజ్ స్టేషన్ సింగరేణి-8712658848, జిల్లా కార్యాలయం నెంబర్-08742-224842, టోల్ ఫ్రీ నెం-1800-425-2523 సమాచారం అందించాలని కోరారు.

## 'బీఆర్ఎస్' గెలుపే లక్ష్యంగా పని చేయాలి

రఘునాథపాలెం, నవంబర్ 28: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం నగరం 3వ డివిజన్‌లో పార్టీ నాయకుడు కొణకంచి వరప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన యువత పెద్ద ఎత్తున బీఆర్ఎస్ గూటికి చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీరాములు, ఆకుల వెంకటేశ్వర్లు, పురం వెంకన్న తదితరులు ఉన్నారు. పార్టీలో చేరిన వారిలో వేముల నాగరాజు, ఉపేందర్, బత్తుల వెంకట్రావు, బత్తుల గోపి, విజయ్‌కుమార్, తమ్మిశెట్టి నరసింహారావు, ఎలమందరావు, వెంకట్రావు, వెంకటేశ్, చల్లా నరేశ్ ఉన్నారు.



పార్టీలోకి చేరిన వారికి కండువాలు కప్పుతున్న మంత్రి పువ్వాడ

# పాలేరులో ఎగిరేది గులాబీ జెండానే..

### 15-20 వేల మెజార్టీతో గెలవబోతున్నాం..
### ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు అందిస్తా
### విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, నవంబర్ 28: ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో పాలేరు గడ్డపై ఎగిరేది బీఆర్ఎస్ జెండానే అని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని సాయిగణేష్‌నగర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ సమన్వయకర్త తాళ్లూరి జీవన్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. నెల రోజులుగా యావత్ పాలేరు ప్రజలు ప్రచారంలో అడుగడుగునా అపూర్వ స్వాగతం పలికారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాలకు వెళ్లిన సమయంలో ఊహించని విధంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. వారి అప్యాయతను ఎప్పటికీ మరువబోనన్నారు. పాలేరులో బీఆర్ఎస్ 15-20వేల మెజార్టీ సాధించడం ఖాయమన్నారు. నాతోపాటు నా కుటుంబ సభ్యులు సైతం కందాళ ట్రస్టు ద్వారా అనేక రూపాల్లో ప్రజలకు సేవలు అందించారన్నారు. పాలేరులో ఎమ్మెల్యే పనితీరు ఇతర నియోజకవర్గాల ప్రజలకు తెలుసని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఈ ప్రాంత ప్రజలకు సంబంధం లేని వ్యక్తి అని, గతంలో ఎంపీగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పర్యటన చేసి ఏ గ్రామంలో తన మార్క్ చూపెట్టలేకపోయాడన్నారు. కేవలం నటనలు, మాయ మాటలు, డబ్బు కట్టలను నమ్ముకొని మాత్రమే పోటీలో ఉన్నారని, ఆయన తీరు పట్ల ఇప్పటికే ప్రజలకు స్పష్టమైన అవగాహన వచ్చిందన్నారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాలేరులో ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు అందించి తీరుతానని అన్నారు. గ్రామాల్లో జూన్ నాటికి సీసీ రోడ్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులు కొద్ది నెలల్లోనే పూర్తి కావొచ్చాయన్నారు. పాలేరుకు గోదావరి జలాలు తీసుకరావడం ఖాయమని, పాలేరు పూర్తిగా ఆకుపచ్చ పాలేరుగా మారుతుందన్నారు. ప్రతి కుటుంబం కందాళను మరోసారి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రజల ప్రేమానురాగాలను డబ్బుకట్టలతో దూరం చేయలేరన్నారు. మరో రెండు రోజులు అప్రమత్తంగా మెలిగి బీఆర్ఎస్ అఖండ విజయంలో కీలకపాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.

# పువ్వాడ అజయ్‌కే రజక సంఘం మద్దతు

### మీడియా సమావేశంలో జక్కుల లక్ష్మయ్య





సమావేశంలో మాట్లాడుతున్న జక్కుల లక్ష్మయ్య

ఖమ్మం సిటీ, నవంబర్ 28: అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కే రజకసంఘం మద్దతు తెలుపుతున్నామని డీసీఎంఎస్ డైరెక్టర్ జక్కుల లక్ష్మయ్య స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖమ్మం జిల్లా రజక సంఘం కన్వీనర్ రేగళ్ల సీతారాములు, జిల్లా నాయకులు రేగళ్ల కొండల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రజక జాతికి చెందిన తెలంగాణ సాయుధరైతాంగ పోరాట యోధురాలు ఐలమ్మను కాంగ్రెస్, ఇతర ప్రభుత్వాలు ఏనాడూ గుర్తించలేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాతనే సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఆమె జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. రజక వృత్తి చేసుకునే లాండ్రీ షాపుల వారికి 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ సర్కారుకే దక్కుతుందన్నారు. ఖమ్మంలో దోబీఘాట్, మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఎంతో విలువైన ప్రభుత్వ స్థలాలను మంత్రి అజయ్‌కుమార్ దగ్గరుండి ఇప్పించారన్నారు. నగరంలోని చెరువు బజార్‌లో అసంపూర్తిగా మిగిలిపోయిన రజక సంఘం భవనానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయించారని వెల్లడించారు. వాటితో భవనాన్ని పూర్తి చేసుకున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రజకులకు ఉచితంగా రూ.లక్ష ప్రభుత్వ సాయాన్ని మంత్రి దగ్గరుండి అందించారని పేర్కొన్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లో తమ సంఘం ఆత్మగౌరవ భవనానికి రెండు ఎకరాల భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వమే కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. అన్ని ప్రభుత్వ సంస్థల్లో బట్టలు ఉతికే కాంట్రాక్టును కేవలం రజకులకు మాత్రమే ఇవ్వాలని సీఎం కేసీఆర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. బీసీల్లోని అన్ని సామాజిక వర్గాలను గుర్తించింది తెలంగాణ ప్రభుత్వం మాత్రమేనని పేర్కొన్నారు. ఇంతటి గొప్ప పనులు చేసిన బీఆర్ఎస్ పార్టీని, ఖమ్మంలో అన్ని వర్గాలకు అండగా నిలబడిన పువ్వాడ అజయ్‌కుమార్ కారు గుర్తుకే ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిజ్ఞ స్వీకరిపై ఉందన్నారు. సమావేశంలో నాయకులు జక్కుల వెంకటరమణ, పిల్లుట్ల కృష్ణ, గోలి రామారావు, వట్టికోట రామారావు, కొత్తపల్లి రమేష్ పాల్గొన్నారు.

# ఎన్నికలకు సమన్వయంతో పని చేయాలి

### జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్





మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్



హాజరైన అధికారులు

మామిళ్లగూడెం, నవంబర్ 28: ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి చేయడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు, పోలీస్ కమిషనర్, వ్యయ పరిశీలకులతో కలిసి నోడల్ అధికారులు, ఏసీపీలు, సీఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పోలింగ్‌కు ముందు 72 గంటల ప్రొటోకాల్‌ను అమలు చేయాలన్నారు. ఇంటింటి ప్రచారానికి మాత్రమే అనుమతి ఉంటుందని, అది కూడా 5 గురి కంటే ఎక్కువ మంది గుమి గూడ కుండా చేపట్టాలన్నారు. డబ్బు, మద్యం, ఉచితాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌ఎస్టీ, ఎఫ్‌ఎస్టీ, నిఘా బృందాలు అప్రమత్తతతో విధులు చేపట్టాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలను బట్టి టేబుళ్లు ఏర్పాటు చేయాలని, సహాయక కేంద్రం ప్రవేశం వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఏఎస్టీ, మార్క్‌డ్ కాపీ ఇచ్చి అవగాహన కల్పించాలన్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రెయిన్ ప్రూఫ్ టెంట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సరైన వెలుతురు ఉండాలన్నారు. తాగునీరు, భోజనం ఏర్పాట్లు చేయాలని, మొబైల్ టాయిలెట్స్ సౌకర్యం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని, 100 శాతం పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వాహనాల పాసులు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల సిబ్బందికి భోజనం, టిఫిన్, స్నాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి రవాణాకు వాహనాలు సిద్ధం చేయాలన్నారు. సమీక్షలో పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ మాట్లాడుతూ.. నిఘా బృందాలు అక్రమ మద్యం అమ్మకాలపై నిరంతర నిఘా పెట్టాలన్నారు. చెక్ పోస్టుల వద్ద ప్రభుత్వ, పోలీస్, ప్రైవేటు, అంబులెన్స్ అన్ని రకాల వాహనాలు తనిఖీ చేయాలన్నారు. సమీక్షలో శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్‌నాయక్, అదనపు డీసీపీ ప్రసాద్‌రావు, నోడల్, పోలీస్, సీఆర్‌ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.